



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

రోడ్ల మరమ్మతులకు తక్షణ చర్యలు

టెండర్ ప్రక్రియ వేగవంతం చేయండి

సమీక్షలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతితో కలిసి గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు సౌకర్యం లేని గిరిజన తండాలకు వెంటనే రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించాలని ప్రధాన రోడ్లతో ఆ గిరిజన తండాలు అనుసంధానమయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, మట్టి రోడ్లను త్వరితగతిన మరమ్మతుచేసి, రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు కలుగకుండా పునరుద్ధరించాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ ద్వారా పంచాయతీ రాజ్ విభాగం నుంచి మంజూరైన రహదారుల పనులకు టెండర్ ప్రక్రియలను వేగంగా పూర్తిచేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పాడైపోయిన రోడ్లు, కల్వర్టులకు ఉపాధిహామీ పథకం కింద పనులు ప్రారంభించాలని సూచించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారి పనులను కూడా సమీక్షించారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టంలో పొందుపర్చిన మినహాయింపులు తప్ప మిగతా అన్ని విషయాల్లో ప్రజలు కోరిన సమాచారాన్ని చట్టం ప్రకారం అందించాలని సూచించారు.



సంక్షోభంలో

సంక్షేమ హాస్టళ్లు

విద్యార్థుల కొరతతో వసతిగృహాలు వెలవెల

కొరవడిన పర్యవేక్షణ

బిల్లులు రావడం లేదంటూ తలపట్టుకుంటున్న అధికారులు

జహీరాబాద్ నియోజకవర్గంలో నాలుగు హాస్టళ్లు మూసివేత

7

సంగారెడ్డి, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ నేతలు,

కార్యకర్తలతో సమావేశమైన ఏఐసీసీ అబ్జర్వర్ జరిట

పాల్గొన్న జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికపై సోమవారం సంగారెడ్డి, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఏఐసీసీ అబ్జర్వర్ జరిట లైట్‌ఫ్లాంగ్ సమావేశమయ్యారు. వ్యక్తిగతంగా అందరి అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ జరిట



సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఏఐసీసీ అబ్జర్వర్ జరిట, జగ్గారెడ్డి, నిర్మల



సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఏఐసీసీ అబ్జర్వర్ జరిట, జగ్గారెడ్డి, నిర్మల

ఇందిరా మహిళా శక్తితో

ఆడబిడ్డకు ఆసరా

- సత్ఫలితాలిస్తున్న పథకం
- క్యాంటీన్ల ఏర్పాటుతో ఆర్థిక భరోసా

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు సంగారెడ్డి జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు స్వయం సహాయక సంఘాల సభ్యులు. గతేడాది 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి తెలంగాణ సర్కారు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూరల్ ఏరియాల్లో ఐదు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అర్బన్ ఏరియాల్లో నాలుగు క్యాంటీన్లు కొనసాగుతున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలతో వీటిని ప్రారంభించారు. నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యమిస్తూ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంటీన్లకు వినియోగదారుల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. రోజుకు రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు విక్రయాలు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్యాంకు వాయిదాలు పోనూ మిగిలిన సొమ్ముతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నామని, కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నామని వారు పేర్కొంటున్నారు.



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో స్వయం సహాయక సంఘం సభ్యురాలు



సంగారెడ్డి జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

ఏకగ్రీవ పంచాయతీలకు దక్కని నజరానా

పదవీకాలం పూర్తయినా విడుదల కాని ప్రోత్సాహకం

ఐదేళ్లు అధికారంలో ఉన్నా దాటవేసిన గత ప్రభుత్వం

ఊసే ఎత్తని ప్రస్తుత సర్కారు

మెదక్ జిల్లాలో 80, సంగారెడ్డి జిల్లాలో 96 పంచాయతీలు

ఎన్నికలు లేకుండా పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే నజరానా అందజేస్తామని 2019 సర్పంచ్ ఎన్నికల సమయంలో అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ప్రోత్సాహకంగా రూ. 10 లక్షలు, నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మరో రూ. 10 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. పల్లెల అభివృద్ధికి నిధులు వస్తాయని ఆశించి అనేక గ్రామాల్లో పార్టీలకు అతీతంగా సర్పంచులు, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కానీ, ఐదేళ్లు అధికారంలో ఉన్నా ప్రోత్సాహకం మాత్రం మంజూరు కాలేదు.



ఆదర్శానికి మొండిచేయి!

మెదక్ అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఐక్యమత్యంగా ఉండి ప్రశాంత వాతారణంలో పల్లెలను తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం 2019 పంచాయతీ ఎన్నికల సమయంలో ఏకగ్రీవ పంచాయతీలకు నజరానాలను ప్రకటించింది. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రతీ గ్రామపంచాయతీకి రూ. 10 లక్షలు ప్రోత్సాహక నిధులు ఇస్తామని ప్రకటించింది. అదనంగా నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మరో రూ. 10 లక్షలు కేటాయిస్తామని పేర్కొన్నది. దీంతో, రూ. 20 లక్షల నిధులు వస్తే గ్రామాన్ని ఎంతో కొంత అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలంతా ఏకమయ్యారు. అభివృద్ధికి అవకాశముంటుందని భావించి పార్టీలను పక్కన పెట్టి జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఏకగ్రీవాలు చేశారు. అప్పట్లో మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉండగా.. 80 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలకు.. 96 పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కానీ, ఐదేళ్లు పూర్తయి.. పాలకవర్గాల పదవీకాలం ముగిసినా ఇప్పటికీ నిధులు మాత్రం మంజూరు కాలేదు. అదిగోఇదిగో అంటూ కాలయాపన చేసిన గత ప్రభుత్వం నిధులివ్వకుండానే దిగిపోయింది. నజరానాలు వస్తాయని ఆశపడ్డ పంచాయతీలకు నిరాశే మిగిలింది. మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నా ప్రోత్సాహకం కింద ఇస్తామన్ని నిధులు రాకపోవడంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారడం, పాలకవర్గాల గడువు తీరిపోవడంతో ఆదర్శ పంచాయతీలకు ఇస్తామన్న ప్రోత్సాహకం రావడం కష్టమేనని పలువురు పేర్కొంటున్నారు.

మరోసారి ప్రజలు నమ్మేనా?

ప్రభుత్వ స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తదుపరి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏకగ్రీవ పాలకవర్గాలకు నజరానాలను ఇప్పటివరకు ప్రభుత్వం ప్రకటించలేదు. ఒకవేళ ప్రకటించినా ప్రజల స్పందన ఎలా ఉంటుదోనన్నది చర్చనీయాంశమే. గత ప్రభుత్వ హామీని నమ్మి ఏకగ్రీవాలు చేసుకుంటే నిధులు రాక. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పాలకవర్గాలు ఉసూరుమన్నాయి.



ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలోని ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు రాలేదు. ఎప్పుడిస్తారన్న సమాచారం లేదు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వానికి నివేదించాం.

-యాదయ్య, డీపీవో మెదక్

పీఎంశ్రీ బడుల్లో కరాటే

ఆత్మరక్షణ విద్యకు నిధులు మంజూరు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మ రక్షణ విద్య అందించేందుకు విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలికలకు ఆత్మరక్షణ విద్య అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు విడుదల చేసింది. జిల్లాలో 44 పీఎంశ్రీ పాఠశాలలుండగా వాటిలో 37 పాఠశాలలకు రూ.30 వేల చొప్పున రూ.10,95,000 నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో సాధారణ విద్యతో పాటు బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ, జూడో వంటి ఆత్మరక్షణ విద్య నేర్పించనున్నారు.

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

28 లోపు దరఖాస్తు చేసుకోండి:ఎస్పీ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఫ్లాగ్‌డేను పురస్కరించుకుని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరిస్తూ ప్రతీ సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్‌డే) నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ పోటీలు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో నిర్వహిస్తామని, ఆరో తరగతి నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ చదివే విద్యార్థులు పాల్గొనడానికి అర్హులని తెలియజేశారు. ఈ నెల 28వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చినవారిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వీరిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండాలో అనే అంశంపై పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు.

దవాఖానాకు వస్తే జేబులు గుల్ల

సంగారెడ్డి ఎంసీహెచ్‌లో దొంగల హల్‌చల్

నిత్యకృత్యమైన చోరీలు

రోగుల సెల్‌ఫోన్‌లు, నగదు అపహరణ

30 సీసీ కెమెరాలున్నా ఫలితం శూన్యం

భద్రతా లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాలకు చెందిన సాయికిరణ్ తన భార్య కాన్పు నిమిత్తం ఈనెల 1న సంగారెడ్డి ఎంసీహెచ్‌లో చేర్చారు. 4వ తేదీన అర్ధరాత్రి మూడో అంతస్తు కారిడార్‌లో నిద్రిస్తుండగా ఆయన జేబులో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ. 30వేల విలువైన సెల్‌ఫోన్, పర్సు కొట్టేశారు. పర్సులో రూ. 5వేల నగదు, ఆధార్, పాన్‌కార్డు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. అదే రోజు.. అదే కారిడార్‌లో నిద్రిస్తున్న వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం ఎన్కతల గ్రామానికి చెందిన కృష్ణ వద్ద నుంచి కూడా రూ. 50వేల విలువైన సెల్‌ఫోన్, రూ. 5వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఆరోజు మొత్తం ఆరు సెల్‌ఫోన్లు, నగదు చోరీ అయినట్టు బాధితులు సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాజాగా రెండ్రోజుల క్రితం ఇదే ఆస్పత్రిలో ఎనిమిది సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్టు తెలుస్తున్నది.





సంగారెడ్డిలోని ఎంసీహెచ్, (ఇన్‌సెట్‌లో) సీసీకెమెరాల్లో నిందితుడు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఎంసీహెచ్‌లో సెల్‌ఫోన్ దొంగతనాలు నిత్యకృత్యం కావడం ఆందోళనకు గురిచేస్తున్నది. డబ్బులు మిగులుతాయని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే జేబులు ఖాళీ కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. చోరీ ఘటనలపై ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకొని సెల్‌ఫోన్లు అప్పగించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోనే 150 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఉన్నది. ఇక్కడ సగటున నెలకు 800 వరకు కాన్పులు జరుగుతుంటాయి. గర్భిణుల వెంట ఉండే సహాయకులు, బంధువులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎంసీహెచ్‌లో నిఘా కోసం 30 సీసీకెమెరాలు ఉన్నాయి. ప్రతీ అంగుళం కవర్ చేసేలా వాటిని అమర్చారు. 24 గంటలు సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉంటారు. ఇంతటి నిఘా ఉన్న ఆస్పత్రిలో నిత్యం ఒకటీ రెండు సెల్‌ఫోన్ చోరీలు జరగడం విమర్శలకు తావిస్తున్నది. మరోవైపు జనరల్ ఆస్పత్రి అత్యవసర విభాగంలోని ఎక్స్‌రే గదిలో ఏకంగా కంప్యూటర్ మాయం కావడం గమనార్హం. అర్ధరాత్రి బయటి నుంచి దొంగలు ఆస్పత్రిలోనికి ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. దీంతో, సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యం, అధికారుల పర్యవేక్షణ లోపిండంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులను సముదాయిస్తున్న అధ్యాపకులు

గణిత అధ్యాపకులు లేక నష్టపోతున్నాం

- ఆగ్రహించిన గురుకుల విద్యార్థులు
- రోడ్డెక్కి ధర్నా.. రాస్తారోకో

చేగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గణిత అధ్యాపకుడు లేకపోవడంతో తమ చదువులు సాగడం లేదంటూ మెదక్ జిల్లా చేగుంట ఎస్టీ స్పోర్ట్స్ గురుకుల కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు సోమవారం ధర్నా, రాస్తారోకో చేశారు. సుదూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చామని అధ్యాపకులే లేకుంటే ఎలా అంటూ ఆందోళనకు దిగారు. చేగుంటలోని ఎస్టీ స్పోర్ట్స్ బాలికల గురుకుల పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్ ఎంపీసీలో మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 80 మంది విద్యార్థినులు ఉన్నారు. గతంలో కళాశాలకు గణితం అధ్యాపకురాలు ఉండగా, గతంలో జరిగిన బదిలీల్లో వెళ్లిపోయారు. దీంతో ఇక్కడ అధ్యాపకురాలు లేకుండా పోయారు. సిలబస్ ముందుకు సాగకపోవడంతో సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకోకు దిగారు. ప్రభుత్వం వెంటనే గణిత అధ్యాపకురాలి పోస్టు భర్తీ చేయాలని నినాదాలు చేశారు. సుమారు 20 నిమిషాల పాటు విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. పరీక్షలు దగ్గర పడుతున్నా సిలబస్ పూర్తి కాకపోతే ఎలా ఉత్తీర్ణులమవుతామని రోదిస్తూ తెలిపారు. అక్కడికి వచ్చిన కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హామీ ఇవ్వడంతో ధర్నా, రాస్తారోకో విరమించారు. ఈ విషయమై మెదక్, నిజామాబాద్ జిల్లాల గురుకుల పాఠశాలల రీజనల్ కో-ఆర్డినేటర్ గంగారాంనాయక్‌ను సంప్రదించగా, చేగుంట ఎస్టీ స్పోర్ట్స్ గురుకుల కళాశాల అధ్యాపకురాలి పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్నది వాస్తవమేనని, కళాశాలకు డిప్యూటేషన్‌పై అధ్యాపకురాలిని పంపించగా, విధుల్లో చేరారని తెలిపారు.



నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశంలో జ్యోతిరౌతాలా తదితరులు

పారదర్శక ఎన్నిక కోసమే అభిప్రాయ సేకరణ

ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతిరౌతాలా

నర్సాపూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీసీసీ ఎన్నిక పారదర్శకంగా నిర్వహించడం కోసమే క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ చేస్తున్నామని ఏఐసీసీ పరిశీలకులు జ్యోతిరౌతాలా పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నికపై నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాయ సేకరణ సోమవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతిరౌతాలా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారు, కార్యకర్తల ఆమోదం ఉన్నవారికే పార్టీ పదవులు ఇవ్వాలనే పార్టీ అధిష్ఠానం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. మండల, బ్లాక్, జిల్లాస్థాయి నాయకుల అభిప్రాయం సేకరించి అధిష్ఠానానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధులు జగదీశ్వర్‌రావు, వరలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా అభిప్రాయ సేకరణ

డీసీసీ అధ్యక్ష పదవీ కోసం నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి తీవ్రంగా కృషి చేస్తుండటంతో అభిప్రాయ సేకరణ వాడీవేడిగా సాగింది. ఇద్దరు నాయకులు తమకు మద్దతుగా కార్యకర్తలను కార్యక్రమానికి తరలించారు. డీసీసీ పీఠం ఆశిస్తున్న ఇద్దరు నేతలూ నర్సాపూర్ నియోజకవర్గానికి చెందినవారే కావడంతో క్యాడర్ ఎవరికివారు తమ నాయకుడికే డీసీసీ పీఠం దక్కుతుందని చర్చించుకున్నారు.



అభిప్రాయ సేకరణకు తరలివచ్చిన స్థానిక నాయకులు, కార్యకర్తలు

ఆవు పొడిచి వృద్ధుడు మృతి



రాజయ్య(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆవు పొడిచి వృద్ధుడు మృతిచెందాడు. హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామానికి చెందిన సొల్లు రాజయ్య(75) ఆదివారం సాయంత్రం గ్రామ పరిసర ప్రాంతంలో తన పాడిగేదెను మేపుతున్నాడు. అక్కడే ఒక ఆవు కూడా ఉన్నది. ఆవు దగ్గరికి వెళ్లిన రాజయ్యను కొమ్ముతో తొడల భాగంలో పొడిచింది. రాజయ్య అపస్మారక పరిస్థితిలో పడిపోగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. రాజయ్యను చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడు భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు పంచనామా చేసి, పోస్టుమార్టానికి తరలించారు.

మొబైల్ షాపులో చోరీ



చోరీకి గురైన మొబైల్ షాపు

కౌడిపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మొబైల్ షాపులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గతంలో నాలుగుసార్లు దొంగతం చేశారు. షాపులో విలువైన వస్తువులతో పాటు కొన్ని మొబైల్ ఫోన్‌లు తీసుకెళ్లారు. షాపులో ఉన్న సీసీ కెమెరాలోని మెమోరికార్డుల ఆనవాళ్లు కనిపించకుండా తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారి 765డిపై పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న షాపులోనే దొంగతనం జరగడంతో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఆత్మహత్యకు కారణమైన ఇద్దరి అరెస్ట్

● మనీ స్కీంలో చేర్పించి మోసం



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట క్రైం, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో చేర్పించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ వెల్లడించారు. సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 9న వర్గల్ మండలం వేలుర్‌కు చెందిన బడుగు హరికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ఆయన సూసైడ్ నోట్ లభించింది. ఆన్‌లైన్ బెట్టింగ్ లో పెద్దఎత్తున డబ్బు పోగొట్టుకున్నట్లు తేలింది. ఇందులో అతని తండ్రి నాగరాజు సుమారు రూ. 8 లక్షలు తీర్చాడు. ఇంకా అప్పు ఉండటంతో దానిని తీర్చేందుకు వ్యాపార మార్గాలు వెతుకుతుండగా, అదే గ్రామానికి చెందిన కాలువల మణికంఠ రెడ్డి పరిచయమయ్యాడు. తాను కొంత పెట్టుబడి పెట్టి అధిక మొత్తంలో లాభాలు సంపాదిస్తున్నానని, తనలాగే కొంత డబ్బు పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని ఆశపెట్టాడు. మణికంఠ, అతని పెద్దనాన్న కుమార్తె అలేఖ్య కలిసి హరికృష్ణను హైదరాబాద్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి అక్కడ రూ. 4 లక్షలు తీసుకుని ఓ సంస్థలో మెంబర్‌షిప్ ఇప్పించారు. బిజినెస్ ప్రమోషన్‌లో భాగంగా ఓ ట్రిక్ కూపన్, ఓ చేతి గడియారం ఇచ్చారు. తర్వాత హరికృష్ణను ఇద్దరూ కలిసి పలు హోటళ్లలో జరిగే సెమినార్లకు తీసుకెళ్లారు. తన డబ్బులు తిరిగే వచ్చే మార్గం కనిపించకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న హరికృష్ణ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేపట్టి మణికంఠ, అలేఖ్యలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు. నిందితులతో పాటు పలువురు క్యూనెట్, ఇతర స్కీముల్లో చేర్పించి మోసం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లాలోని ములుగు, మెదక్ జిల్లాలోని నిజాంపేట, కౌడిపల్లి, చిన్నశంకరంపేట, శివ్వంపేట మండలాల్లో చోటు చేసుకున్నది.



అశ్వినీ(ఫైల్)

ములుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన తిప్పగాని మల్లాగౌడ్ పెద్ద కూతురు అశ్వినీ(26)కి 2019లో కొక్కొండ గ్రామానికి చెందిన గుంతటిపల్లి రవిగౌడ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త, అత్త, మరిదులు తరచూ అశ్వినీతో గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన అశ్వినీ ఆదివారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం తండ్రి మల్లాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కుమారుడి మృతిని తట్టుకోలేక..



జ్యోతి(ఫైల్)

నిజాంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుమారుడి మృతి తట్టుకోలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మెదక్ జిల్లా నిజాంపేటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామానికి విభూతి జ్యోతి(41) బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్ జిల్లాకు కుటుంబంతో కలిసి వలస వెళ్లింది. అక్కడ కుమారుడు అనిల్(17) ఫిట్స్‌తో నెలరోజుల క్రితం ఓ వాగులో పడి మృతిచెందాడు. అప్పటి నుంచి బెంగ పెట్టుకున్న తల్లి సోమవారం సాయంత్రం నిజాంపేటలో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త నర్సింలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

అప్పులు ఎక్కువై.. మనస్తాపానికి గురై..



నెల్లూరు వెంకటేశం (ఫైల్)

కౌడిపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకుని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కౌడిపల్లి మండలం సలవత్‌పూర్ గ్రామానికి చెందిన నెల్లూరు వెంకటేశం(51) నాలుగేళ్ల క్రితం కూతురు వివాహం చేశాడు. దీంతో రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలని కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ మురళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత కారణాలతో యువకుడు..



యాదగిరి(ఫైల్)

చిన్నశంకరంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డి దుర్గాప్రసాద్(24) వ్యక్తిగత కారణాలతో ఒత్తిడిని భరించలేక ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

తల్లి మందలించిందని..



మహమ్మద్(ఫైల్)

శివ్వంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నావని తల్లి మందలించడంతో ఓ కుమారుడు ఆతహ్మత్య చేసుకున్న ఘటన మండలంలోని గంగయ్యపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం.. గంగయ్యపల్లికి చెందిన ఎండీ చాంద్‌బీ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. ముగ్గురు కుమారుల వివాహం కాగా, చిన్నకుమారుడు మహమ్మద్(25)తో కలిసి ఉంటోంది. అతను శభాష్‌పల్లి శివారులోని ఓ పరిశ్రమలో పని చేసేవాడు. కల్లుకు బానిసైన మహమ్మద్ పనికి వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండటంతో తల్లి మందలించింది. దీంతో సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



సందిల రాజు(ఫైల్)

మర్కుక్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందిన సంఘటన మర్కుక్, కల్హేర్, కౌడిపల్లి మండలాల్లో చోటు చేసుకున్నది. మర్కుక్ మండలం పాములకుర్తి గ్రామానికి చెందిన బాలకృష్ణ(59) గ్రామం నుంచి గౌరారం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గ్రామ శివారులోని కావేరి కంపెనీ కోల్డ్ స్టోరేజ్ వద్ద వెనక నుంచి వచ్చిన (టీఎస్ 13 ఎస్ 0666) నెంబరు గల కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మర్కుక్ ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కల్హేర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కల్హేర్ మండలం మహదేవ్‌పల్లి గ్రామానికి చెందిన సందిల రాజు(32) ఈ నెల 2న విజయదశమి నాడు అత్తగారి గ్రామమైన నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి శివుని కుచ్చ సమీపంలో 161వ జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. తనంతట తనే పడిపోయాడా..? లేక ఏదైనా వాహనం ఢీకొట్టిందా.. అనే విషయం తెలియరాలేదు. తీవ్రంగా గాయపడిన రాజును హైవే అథారిటీ సిబ్బంది అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు శేఖర్ సోమవారం కల్హేర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రహీంగూడలో ఒకరు..

కౌడిపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిలప్‌చెడ్ మండలం రహీంగూడకు చెందిన జూల కిష్టయ్య(48) ఈనెల 1న కౌడిపల్లి మండలంలోని సలవత్‌పూర్‌లో చేపలు అమ్మేందుకు తన టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లి తిగిరి వస్తున్నాడు. మర్రిచెట్టుతండా సమీపంలో ఎక్సెల్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ మురళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

జగదేవపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సర్దగాని రాజు(35) గ్రామంలోనే టెంట్‌హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తమ కులానికి చెందిన ఇద్దరి దశదినకర్మకు మహాసముద్రం చెరువు కట్టకు తలనీలాలు తీసుకునేందుకు వెళ్లాడు. తలనీలాలు తీసుకుని స్నానానికి చెరువులోకి దిగిన రాజు ప్రమాదవశాత్తు నీట మునిగాడు. వెంటనే కుటుంబసభ్యులు బయటకు తీసినా.. రాజు అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా చేరుకొని కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కూతుళ్లు వికిత, హాసిని, కుమారుడు నితిన్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు



ఘనపూర్ ఆనకట్ట వద్ద గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

కొల్చారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన కొల్చారం మండలం ఘనపూర్ ఆనకట్ట వద్ద సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సురేష్(25) ఘనపూర్ ఆనకట్టకు వరద తగ్గడంతో చేపల వేటకు వెళ్లి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో అదుపు తప్పి నదిలో పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఎస్‌ఐ మొయినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టివేత



టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన బియ్యాన్ని పంచనామా చేస్తున్న ఆర్‌ఐ సాయిశ్రీకాంత్

టేక్మాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం వాహనాన్ని టేక్మాల్ పోలీసులు సోమవారం ఉదయం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి పెద్దశంకరంపేటకు ట్రాలీ ఆటోలో సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బోడ్మట్‌పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకుని, రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. ఆర్‌ఐ సాయిశ్రీకాంత్ పంచనామా నిర్వహించి, పాపన్నపేట గోదాంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాంబండలో..

శివ్వంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీఫాంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని పాంబండ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ శేఖర్ రేషన్ బియ్యాన్ని పౌల్ట్రీఫాంలో అక్రమంగా నిల్వ ఉంచాడు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి, ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు డీలర్ శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.



పాంబండ పౌల్ట్రీఫాంలో పట్టుబడ్డ రేషన్ బియ్యం

కుక్కల దాడిలో మహిళకు గాయాలు



జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

మెదక్ కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పరిధిలోని మక్తా భూపతిపూర్ గ్రామంలో గుమ్మాల శోభ(35) అనే మహిళపై, మరో ఇద్దరిపై వీధి కుక్కలు దాడిచేశాయి. దీంతో మహిళ చేతికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధికుక్కలు ఎక్కడపడితే అక్కడ సంచరిస్తున్నాయని, కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.



శివంపేట మంజీర నది వంతెన వద్ద విఠల్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రాణాలు కాపాడిన 'ఆంధ్రజ్యోతి' కథనం

- మంజీరా వంతెన సూసైడ్ స్పాట్‌గా మారిందని కథనం
- స్పందించి కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసిన ఎస్పీ
- ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఒకరు
- కాపాడిన కాపలా సిబ్బంది

పుల్‌కల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంజీరా వంతెన సూసైడ్‌స్పాట్‌గా మారిందని 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 11న ప్రచురితమైన కథనంతో స్పందించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఏర్పాటు చేసిన కాపలా ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడింది. హైదరాబాద్‌లోని మల్లంపేటకు చెందిన విఠల్‌గౌడ్(37) అందోలు మండలం బ్రహ్మణపల్లికి వచ్చి డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు భార్యతో గొడవపడి ఆదివారం రాత్రి 8.50 గంటలకు ఆత్మహత్య చేసుకునేందుకు శివంపేట సమీపంలోని మంజీర నది వద్దకు వచ్చాడు. నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే వంతెన వద్ద కాపలాగా ఉన్న కానిస్టేబుళ్లు వేణుగోపాలరావు, నర్సింహులు గమనించి అతనిని బైక్‌పై వెంబడించారు. అటుగా వస్తున్న మరికొందరి సహాయంతో విఠల్‌గౌడ్‌ను పట్టుకుని, ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. అతని వివరాలు తెలుసుకుని గ్రామ మాజీ ఉపసర్పంచ్ నర్సింలుకు అప్పగించారు. విఠల్‌గౌడ్‌ను రక్షించిన పోలీసులను గ్రామస్థులు అభినందించారు.

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో



అంబాజీపేట గ్రామంలోని మెదక్-చేగుంట రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు, పాఠశాల సమయానికి బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమయానుకూలంగా నడపాలని చిన్నశంకరంపేట మండల పరిధి అంబాజీపేట గ్రామంలోని బస్టాప్ వద్ద విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయానికి బస్సులు నడపకపోవడంతో కళాశాలకు, పాఠశాలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకు నడవాల్సిన బస్సులు 10.30 గంటలకు వేస్తున్నారని, అవికూడా సరిగ్గా రావడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడిపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిలో ఆస్కీ బృందం సందర్శన

- సదుపాయాలు, సిబ్బంది, సౌకర్యాల తీరుపై ఆరా



నర్సాపూర్ ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్‌తో వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్‌సీఐ బృందం

నర్సాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిని సోమవారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ(ఎఎస్‌సీఐ) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆస్పత్రినిలో సదుపాయాలు, సౌకర్యాలతో పాటు సిబ్బంది, ఏఎన్ఎం సంఖ్యతో పాటు ఇతర పరిస్థితులను పరిశీలించి వస్తున్న రోగుల సంఖ్యతో పాటు ఇంకా అవసరమున్న సిబ్బందితో పాటు ఇతర సదుపాయల గురించి స్థానిక సూపరింటెండెంట్ డాక్టర్ పావనితో పాటు ఇతర డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకుని వెళ్లినట్లు తెలిపారు. నర్సాపూర్ ఆసుపత్రిలో మరింత మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన వాటిని సమకూర్చడంలో భాగంగా ఈ బృందం వచ్చినట్లు సూపరిండెంట్ తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

- మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

హవేళిఘణపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు డిజిటల్ లర్నింగ్ పుస్తకంపై ఆయన అవగాహన కల్పించారు. భౌతిక, రసాయనిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఉంటుందన్నారు.



విద్యార్థులు లేక మూతపడిన మల్‌చెల్మ గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహం

సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

- వసతి గృహాలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- బిల్లులు రావడం లేదంటూ తలలు బాదుకుంటున్న అధికారులు
- విద్యార్థుల కొరతతో వసతిగృహాలు వెలవెల
- ఇప్పటికే నియోజకవర్గంలో నాలుగు హాస్టళ్ల మూసివేత

జహీరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలకు పెద్దపీట వేయడంతో వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న వసతి గృహాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అందులో పనిచేసే సిబ్బంది పనితీరు అంతు బట్టని దిగా ఉన్నది. బిల్లులుసకాలంలో రావడం లేదని, అప్పులు చేస్తూ విద్యార్థులకు అవసరమైన సరుకులు తెస్తున్నామని వసతి గృహాల నిర్వాహకులు సాకు చూపుతు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు, వసతి గృహాలపై నమ్మకం కొరవడడంతో కూలీ పనులు చేసుకునే నిరుపేదలు సైతం తమ పిల్లలను పట్టణ ప్రాంతాల్లో గల ప్రైవేట్ హాస్టళ్లకు, పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, వసతిగృహాల వార్డెన్లు తంటాలు పడుతున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. వసతి గృహానికి సుమారు 3-4 కిలోమీటర్ల దూరంలోఉన్న నిరుపేద విద్యార్థులను చేర్పించుకోవాలనే నిబంధన వార్డెన్లకు సమస్యగా మారింది. విద్యార్థుల సంఖ్య లేని కారణంగా వసతి గృహాలను ఎత్తేసే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహాలకు విద్యార్థుల కొరత

నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికలకు సంబంధించి 19 వసతి గృహాలున్నాయి. అందులో దిగ్వాల్, మల్‌చెల్మ, హద్నూర్, అసద్‌గంజ్‌లో గల నాలుగు హాస్టళ్లు మూతపడ్డాయి. ప్రస్తుతం 15 వసతి గృహాలు కొనసాగుతున్నాయి. ఆయా వసతి గృహాల్లో సుమారు 2 వేల పైచిలుకు విద్యార్థుల సంఖ్య ఉండాల్సి ఉంది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 1000 దాటలేని పరిస్థితి నెలకొంది. ఒక్కో వసతి గృహంలో.. ఒక్కో తరహాలో విద్యార్థులసంఖ్య ఉంది. జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్‌లో ఐదు బీసీ బాలుర, బాలికల వసతి గృహాలు ఉన్నాయి. జహీరాబాద్‌లో పట్టణంలో మూడు వసతి గృహాలుండగా.. ఆయా వసతి గృహాల్లో సుమారు 600 మంది విద్యార్థులకు.. కేవలం 200 మందే ఉన్నారు. న్యాల్‌కల్‌లో 100 మందికిగాను 30 మంది, ఝరాసంగంలో 100 మందికిగాను 90 మంది విద్యార్థులున్నారు. అలాగే ఝరాసంగం, జహీరాబాద్, కోహీర్‌లో ఏడు ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలుండగా.. అందులో 1100 మంది విద్యార్థులకు.. కేవలం 500 మందే ఉన్నారు. జహీరాబాద్ పట్టణంలో 250 మందికిగాను 150 మంది, ఝరాసగంలో 220కిగాను 150, కోహీర్‌లో 300లకుగాను 113, పట్టణంలోని కళాశాల వసతి గృహల్లో 227కుగాను 90 మంది విద్యార్థులున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోగల ఎస్టీ వసతి గృహాల్లో 250 మంది విద్యార్థులకుగాను 100 మంది ఉన్నారు. ఆయా వసతి గృహాల్లో సంఖ్య తక్కువగా ఉన్నందున క్షేత్రస్థాయిలో ఆశించినతరహాలో స్పందనరాకపోవడంతో వసతి గృహాల వార్డెన్లకు తలనొప్పిగా మారింది. అందరూ గురుకులాల వైపు మొగ్గుచూపుతున్నారని పలువురు వార్డెన్లు స్పష్టం చేశారు.





శిథిలావస్థకు చేరిన పట్టణంలోని లతీఫ్ రోడ్‌లోగల బాలికల వసతి గృహం, వసతి గృహం లోపల శిథిలావస్థకు చేరిన భవనం దృశ్యం

నాలుగు వసతి గృహాల మూసివేత

విద్యార్థుల సంఖ్య లేని కారణంగా ఇప్పటికే నియోజకవర్గంలోని దిగ్వాల్, మల్‌చెల్మ, అసద్‌గంజ్, హద్నూర్ వసతి గృహాలను మూసివేశారు. అందులో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే సిబ్బందికి ఐదునెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాల వార్డెన్లకు సైతం ఆరునెలలుగా బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మున్ముందు వీటిని కొనసాగిస్తారో.. లేదో అన్న అనుమానం అందులో పనిచేసే ఉద్యోగులను వెంటాడుతోంది.

దివ్యాంగుడి ఇంటికి అడ్డంకులు

- బెదిరింపులకు గురిచేస్తున్న కొందరు

కంది, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కంది గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో దివ్యాంగుల ఇళ్ల నిర్మాణాలపై రియల్ దళారుల జులుం ప్రదర్శిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీనగర్ కాలనీలో దివ్యాంగుడు గద్దె శ్రీనివాసరావుకు 2003లో 100 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ అప్పటి అధికారులు సర్టిఫికెట్ జారీచేశారు. 2016లో రేకుల ఇళ్లు కట్టుకున్నాడు. అప్పటి నుంచి శ్రీనివాసరావు క్రమ తప్పకుండా ఇంటి పన్ను కట్టి కంది గ్రామపంచాయతీ నుంచి 2017లో ఓనర్‌షిప్ సర్టిఫికెట్ పొందాడు. అయితే 2019లో స్థానికులు కొందరు లక్ష్మీనగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని కొన్ని ఇళ్లను కూల్చివేశారు. అందులో శ్రీనివాసరావు ఇళ్లు కూడా ఉన్నది. అయితే తాను దివ్యాంగుడినని, తనకు ప్రభుత్వం ఇళ్ల పట్టా ఇచ్చిందని ఆధారాలు చూపించి.. అదే స్థలంలో కూడబెట్టుకున్న డబ్బులతో పాటు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. అదే కాలనీలో రియల్ వ్యాపారం చేసే కొందరు తమకు ముడుపులు ఇవ్వకుంటే నిర్మాణం పూర్తి చేయనీయమని బెదిరింపులకు గురిచేస్తున్నారని తన బాధను 'ఆంధ్రజ్యోతి'కి చెప్పుకుని వాపోయాడు. ఇటీవల పంచాయతీ సిబ్బంది అన్ని అనుమతులు ఉన్నాగానీ మళ్లీ పర్మిషన్ తీసుకోవాలని నోటీసులు జారీ చేశారని ఆయన తెలిపాడు. ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు.



తనకు కేటాయించిన సోమవారం స్థలం సర్టిఫికెట్‌ను చూపుతున్న దివ్యాంగుడు శ్రీనివాసరావు

బడిచుట్టూ మురుగునీరు

- డ్రైనేజీల నుంచి నేరుగా అక్కడికే..
- దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు

మనోహరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని మురుగునీరంతా పాఠశాల చుట్టూ చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు దుర్వాసన భరించలేకపోతున్నారు. మండలంలోని రంగయపల్లి శివారు జిల్లా పరిషత్ పాఠశాల భవనం ఉండగా, చెట్ల గౌరారం గ్రామానికి చెందిన డ్రైనేజీ నీరంతా పాఠశాల చుట్టూ చేరుతోంది. మూడు నెలలుగా పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరి దోమలు పెరిగిపోయాయి. దీంతో తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చోలేకపోతున్నారు. ఎలాగోలా కూర్చుదామనుకున్నా.. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఈ పాఠశాలలో నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, చుట్టూ మురుగు నీరు చేరినా పట్టించుకునేవారు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శిని సంప్రదించగా, అధికారులకు సమాచారం ఇస్తానని గ్రామస్థులు తెలిపారు. న్నారు.



రంగాయపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల చుట్టూ చేరిన మురుగు నీరు

ఆర్థిక భారాన్ని తగ్గించేందుకే ఇసుక బజార్

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీజీఎండీసీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ఇసుక బజార్ ద్వారా ఇసుక సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నర్సాపూర్ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీచేసి సరఫరా అవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కేవలం నల్గొండ నుంచి వస్తున్నందున ఇసుకకు ఇక్కడ మెట్రిక్ టన్నుకు రవాణా చార్జీ కింద రూ.1,200 చెల్లించి గ్రామ కార్యదర్శి నుంచి టోకెన్ తీసుకొస్తే ఇసుక ఇస్తారని చెప్పారు.



నర్సాపూర్‌లో ఇసుక బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థి వివేక్ మృతిపై విచారణ చేపడుతాం

- ఈ విషయంపై మంత్రులతో మాట్లాడాం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హుస్నాబాద్‌రూరల్/నంగునూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 7న ఎనిమిదవ తరగతి విద్యార్థి సనాదుల వివేక్ మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమ గురకుల పాఠశాలను ఆయన సందర్శించారు. మృతుడు వివేక్ మృతి చాలా బాధాకరమన్నారు. ఘటనపై ఉపాధ్యాయులను, 12 మంది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వంటగదులు, తరగతి గదులను పరిశీలించి మాట్లాడారు. ఈ ఘటనపై జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో, సాంఘీక సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌లతో మాట్లాడామన్నారు. గురుకుల పాఠశాలను సందర్శించి విచారణ చేసి సంఘటన వివరాలు తేవాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థి మృతి సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీ, కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. విచారణ ఆఫీసర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయభార్గవ్‌ను నియమించామని కలెక్టర్ హైమావతి చెప్పినట్లు వెల్లడించారు. విద్యార్థి మృతిపై హుస్నాబాద్ ఏసీపీ సదానందం, పోస్టుమార్టం రిపోర్ట్, విజయభార్గవ్ ఇచ్చే రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. వివేక్ కుటుంబానికి న్యాయం చేకూర్చుతామన్నారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, సాంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య, నియోజక వర్గ ఇన్‌చార్జి ఆరె కిషోర్, ఎలుక అంజనేయులు, జాల శ్రీనివాస్, గిరిప్రసాద్, కొంరయ్య, రమేష్, సాయిరామ్ ఉన్నారు. వివేక్ మృతిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం నంగునూరులోని విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించి మాట్లాడారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు దేవులపల్లి యాదగిరి, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు



గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం

కోహెడ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడల్లో అండర్-17 బాలుర ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు కోహెడ మండలం వరుకోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గండికోట అక్షయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయినా ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఫుట్‌బాల్ క్రీడను ప్రాక్టీసు చేసిన అక్షయ్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు డి.కృష్ణవేణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, సంగు రామకృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు. అలాగే మెదక్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో సిద్దిపట జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ సంక్షేమ పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న జీ.తేజ, ఎస్కె.రషీద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అంతేకాకుండా జి.తేజ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కోఆర్డినేటర్లు రజిత, జీశాన్ అహమ్మద్, ఉపాధ్యాయులు బాబురావు, రంజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు జ్ఞానేశ్వర్

దుబ్బాక/మిరుదొడ్డి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన చాకలి జ్ఞానేశ్వర్ ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-17 విభాగంలో లాంగ్‌జంప్‌లో 5.41 మీటర్ల దూరం దూకి గోల్డ్‌మెడల్‌ను సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. కాగా జ్ఞానేశ్వర్‌ను ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దుబ్బాక సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీ మహేష్‌లు తెలిపారు.

బాస్కెట్ బాల్ పోటీలకు..

చేగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు చేగుంట ఎస్టీ గిరిజన బాలికల క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కల్పన, విజ్ఞానేశ్వరి, గీత, అర్చన ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..

నారాయణఖేడ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇర్ఫాన్, షానవాజ్, అజన్, ఫయజ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనపతి తెలిపారు. విద్యార్థులను గణపతితో పాటు ప్రధానోపాధ్యాయులు రాములు, పీఈటీ అజీజ్, సంతోష్, ధన్‌రాజ్ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



దుబ్బాక : రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి వేదిక ప్రజావాణి

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు పరిష్కార వేదిక ప్రజావాణి అని, ఇందులో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టరేట్‌లలో వేర్వేరుగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయా జిల్లాల నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్లు ప్రజలతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ అర్జీపై సంబంధిత అధికారులు దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సంగారెడ్డిలో 38 ఫిర్యాదులు

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 38 అర్జీలు వచ్చాయని అధికారులు వెల్లడించారు. సిర్గాపూర్ మండలం గోర్లగామ్ గ్రామానికి చెందిన అక్షయ దివ్యాంగురాలు గత నాలుగు నెలల నుంచి తన పింఛన్‌ను నిలిపివేశారని, తనను ఆదుకోవాలని వేడుకున్నది. న్యాల్‌కల్ మండలం చీలపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు(మరుగుజ్జు)తాను పదో తరగతి ఉత్తీర్ణుడనయ్యానని, బ్యాక్‌లాగ్ పోస్టు ఉద్యోగం చూపించాలని అర్జీ పెట్టుకున్నాడు. ఝరాసంగం మండలంలోని రైతులు తమ భూముల్లో విద్యుత్ టవర్లు వేసి పరిహారం రూ.12 లక్షలు ఇస్తామని రూ.2 లక్షలు మాత్రమే ఇచ్చారని, పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి, అధికారులు ఉన్నారు.



సంగారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టరేట్‌లలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్

మెదక్‌లో 58 వినతులు

మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 58 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలు 24, ఇండ్లు 6, పింఛన్ 10, ఇతర సమస్యలకు సంబంధించినవి 18ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనవి ఇలా.. అల్లాదుర్గం మండలానికి మంజూరైన సబ్‌ట్రెజరీ కార్యాలయం తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ నియోజక వర్గ సాధన సమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం వినతిపత్రాన్ని అందజేశారు. చేగుంట మండలం వడియారంలోని అపోలో ట్యూబ్స్ పరిశ్రమలో పర్మినెంట్ ఉద్యోగుల బదిలీలు నిలిపివేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, పక్షులు నరసింహారెడ్డి, అధ్యక్షుడు వడ్ల నర్సిం తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే..

- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పోలీసు ప్రజావాణి

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయా జిల్లాల పోలీసు కార్యాలయాల్లో వేర్వేరుగా పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వినతిపత్రాలను స్వీకరించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఫోన్ ద్వారా జిల్లాలోని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. కాగా మెదక్ జిల్లాలో 11 ఫిర్యాదులు వచ్చినట్టు ఎస్పీ వెల్లడించారు.

లైవ్ ఇంటరాక్షన్ విత్ పీఎంలో దొరకని అవకాశం


ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ కోసం ఎదురు చూస్తున్న అధికారులు, విద్యార్థినులు

రామచంద్రాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ బిల్డథాన్-2025 పేరిట సోమవారం నిర్వహించిన లైవ్ ఇంటరాక్షన్ విత్ పీఎం(వీడియో కాన్ఫరెన్స్) కార్యక్రమంలో పాల్గొనే అవకాశం సంగారెడ్డి జిల్లా తెల్లపూర్ మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్ కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు దక్కలేదు. ఈ పథకంలో భాగంగా సోమవారం దేశవ్యాప్తంగా 26 వేల పాఠశాలల విద్యార్థులతో ప్రధాని నరేంద్ర మోదీ లైవ్ సిక్రోనైజ్డ్ ఇన్నోవేషన్‌లో మాట్లాడాల్సి ఉంది. 'ఆటో ఫ్లష్ ఫర్ టాయిలెట్స్' నమూనాను రూపొందించిన ఉస్మాన్‌నగర్ కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో భాగంగా ప్రధానితో మాట్లాడేందుకు స్థానికంగా ఏర్పాట్లు చేశారు. అయితే, వారికి అవకాశం దక్కలేదు. కార్యక్రమంలో ఈ నెల 31 వరకు కొనసాగనుండగా, మరోసారి అవకాశం దక్కుతుందని ఆశిస్తున్నారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కందుకూరు కస్తూర్బా పాఠశాల విద్యార్థులు సైతం ఎంపికయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షణ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ పాల్గొన్నారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ బిల్డథాన్-2025ను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో బాలయ్య, సైన్స్ అధికారి సిద్దారెడ్డి, జెండర్ ఈక్విటీ కో-ఆర్డినేటర్ సునితాకన్న, ఎంఈవో పీపీ రాథోడ్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవిత పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల ఇద్దరి అదృశ్యం


గంగమ్మ

రామచంద్రాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం కేసు కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం నమోదైంది. సీఐ గణేష్ పటేల్ వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గురుమెటకల్‌కు చెందిన బసప్ప తన కుటుంబ సభ్యులతో కలిసి తెల్లాపూర్‌కు ఉపాధి నిమిత్తం వలసవచ్చారు. భార్య, పిల్లలు స్థానికంగా కూలీ పని చేసుకుంటూ ఇక్కడే స్థిరపడ్డారు. సోమవారం అతడి కూతురు గంగమ్మ(19) స్థానిక అపార్టుమెంట్లలో పనిచేయడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లి చెన్నమ్మ ఇరుగుపొరుగువారిని విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చండూరులో వ్యక్తి..


దూదేకుల యూసుఫ్

చిలప్‌చెడ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని చండూరు గ్రామంలో వ్యక్తి అదృశ్యం కేసునమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు గ్రామానికి చెందిన దూదేకుల యూసుఫ్(35) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు అతనికి భార్య రిజ్వాన, ఇద్దరు పిల్లలు ఉండగా ఇటీవల అతడు మద్యానికి బానిసై పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. అతడి భార్య రిజ్వాన ఈ నెల 3 వ తేదీ రాత్రి పూట మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్తను తాగవద్దని మందలించింది. రాత్రి ఇంట్లో పడుకున్న యూసుఫ్ మరుసటి రోజు ఉదయం పడుకున్న చోట కనిపించలేదు. అతడి భార్య రిజ్వాన చుట్టు పక్కల, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు నర్సింలు తెలిపారు.

చౌటకూర్‌లోనే ప్రభుత్వ కార్యాలయాలు


చౌటకూర్‌లో ప్రభుత్వ స్థలం మ్యాపును పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

పుల్‌కల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్‌లోనే ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నామని అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు తెలిపారు. సోమవారం ఆయన తహసీల్దార్ నామాల కిష్టయ్య, సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డిలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్, ఎంపీడీవో ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలం అవసరం కావడంతో సర్వే నంబరు 1618లో 13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదన్నారు. ఇందులో 10 ఎకరాలను ప్రభుత్వ న్యాయ కళాశాలకు కేటాయించామని, మిగిలిన మూడెకరాల ప్రభుత్వభూమిని చౌటకూర్ ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించనున్నామన్నారు. అంతకుముందు 202 సర్వే నంబరులో గల 1.35 గల కొండయ్య కుంటను పరిశీలించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈఈ విక్రం, గిర్దావర్ ప్రమోద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శివ్వంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని రత్నాపూర్ అటవీ ప్రాంతంలో సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా విజేతలకు నగదు అందజేత


జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన బాలికలను సన్మానిస్తున్న దృశ్యం

పుల్‌కల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికల జట్లకు సోమవారం నగదును అందజేశారు. మండల కేంద్రమైన చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు ఇటీవల నారాయణఖేడ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో బాలికలు అండర్ 17 విభాగంలో ప్రథమ స్థానం, అండర్ 14 విభాగంలో ద్వితీయ స్థానాల్లో నిలిచారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ యువనాయకురాలు చంటిదేవి కప్రభు ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. వారిని శాలువాలతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేత పై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

జోగిపేట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు యువకులు బైక్ తో కారును ఢీకొని, దంపతుల పట్ల అనుచిత వ్యాఖ్యలతో దాడికి పాల్పడ్డ ఘటన అందోల్ మండల పరిధిలోని అల్మాయిపేట వద్ద సోమవారం చోటుచేసుకుంది. బీఆర్‌ఎస్ టేక్మాల్ మండల అధ్యక్షుడు బత్తుల వీరప్ప తన భార్యతో కలిసి సంగారెడ్డి నుంచి జోగిపేటవైపు కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో అల్మాయిపేట టర్నింగ్ పాయింట్ వద్ద గల నాందేడ్ - అకోలా 161వ జాతీయ రహదారిపై అందోల్ గ్రామానికి చెందిన కటికే జాఫర్, షాహిద్‌లు మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ వీరప్ప కారును ఢీకొన్నారు. తప్పంతా కారులో ప్రయాణిస్తున్న వీరప్పదేనని ఆరోపిస్తూయువకులు జాతీయ రహదారిపై హంగామా సృష్టించారు. అనుచిత వ్యాఖ్యలతో గొడవకు దిగి దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఈ దాడిలో వీరప్ప దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు యువకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో వారిని మందలించారు. దంపతులు జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో దాడికి పాల్పడ్డవారిపై ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పాండు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

'మాస్ సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ సెషన్' ప్రపంచ రికార్డు



అవార్డు అందుకుంటున్న చల్లా గీతా

మెదక్ అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): లార్జెస్ట్ మాస్ సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ సెషన్ ప్రపంచ రికార్డుగా గుర్తింపు పొందింది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈనెల 10న మనోజాగృతి సంస్థ 13 వార్షికోత్సం పురస్కరించుకొని సంస్థ వ్యవస్థాపకులు డా. చల్లా గీతా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అతి పెద్ద సామూహిక సైకాలజికల్ ఫస్ట్ ఎయిడ్ సెషన్ కార్యక్రమం ప్రపంచ రికార్డులో స్థానం దక్కించుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రపంచ రికార్డు యూనియన్ అధికారిణి షరీఫా హనీఫ్ చేతుల మీదుగా మెదక్ పట్టణానికి చెందిన డా. చల్లా గీతా రికార్డు పత్రాన్ని అందుకున్నారు.

ఆర్టీసీ ఎండీని కలిసిన ఎంఆర్‌కే రావు


ఎండీ నాగిరెడ్డిని సన్మానిస్తున్న టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి

మెదక్ అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీ నూతన ఎండీగా బాధ్యతలు స్వీకరించిన నాగిరెడ్డిని, టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి మేడి రాధాకిషన్ రావు సోమవార హైదరాబాద్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, యూనియన్లు పునరుద్ధరించాలని ఎండీని కోరినట్లు ఆయన తెలిపారు. బాధ్యులు సంగమేశ్వర్, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చగా మారిన ఓట్‌చోరీ

జహీరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓట్ చోరీ మచ్చగా తయారైందని నియోజకవర్గ మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా పేర్కొన్నారు. మండలంలోని ఆనెగుంటలో సోమవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఓట్‌చోర్ గద్దీచోడ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళాకాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఓటుహక్కుపై అందరికి అవగాహన కల్పిస్తు సంతకాలసేకరణ చేపట్టారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలి


తూప్రాన్‌లో జీపీవోల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వివిధ భూ సంబంధిత చట్టాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామ పాలన విధులపై అవగాహన కలిగి ఉండాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. సోమవారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో డివిజన్ పరిధిలో నూతనంగా నియమితులైన జీపీవోలకు శిక్షణ కల్పించారు. రెవెన్యూ చట్టాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామపాలన విధానలపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా భూభారతి చట్టంపై వివరించి, గ్రామస్థాయిలో భూముల రికార్డుల డిజిటల్ నిర్వహణ, ప్రజలకు సులభంగా భూమి వివరాలు అందుబాటులో ఉంచడం, భూములపై అనధికార ఆక్రమణలు నివారించడం వంటి అంశాలను వివరించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలు


సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ, ఎమ్మార్పీఎస్ వేర్వేరుగా ధర్నా నిర్వహించారు. జిన్నారం మున్సిపల్ కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించగా సీజేఐ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ స్కూల్ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):సంగారెడ్డి విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ ధరించడం ప్రాముఖ్యతను బుర్రకథ ద్వారా విద్యార్థులు వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ సైలెన్సర్లు మార్పిడి చేస్తే చర్యలు: ట్రాఫిక్ సీఐ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): అధిక సౌండ్ కోసం బైక్ సైలెన్సర్లను మార్పిడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి పట్టణంలోని ట్రాఫిక్ పోలీసులు ఐబీ వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ బైక్‌ను ఆపి సైలెన్సర్లను చెక్ చేశారు. కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్ కాకుండా అధిక శబ్దం వచ్చే విధంగా సైలెన్సర్లను మార్పిడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ముగిసిన ఇర్ఫానీ దర్గా ఉర్సు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఉర్సులో భాగంగా దర్గాలో దుర్గా నిర్వాహకులు హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ నజ్జద్ యే నఖీన్ బార్గ ఇర్ఫానీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, భక్తులు హాజరై దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: టీపీటీఎఫ్

హవేళీఘణపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. సోమవారం మండలంలోని తిమ్మాయిపల్లి పాఠశాల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరాకు ప్రకటించే డీఏ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవీసింగ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సత్యనారాయణ తదితరులున్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధికి నిధులు

పటాన్‌చెరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వెల్లడించారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ముత్తంగి గ్రామంలో రూ.12.30 కోట్ల అంచనా వ్యయంతో నిర్మంచతలపెట్టిన సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఉపాధ్యక్షురాలు స్వప్నశ్రీనివాస్, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, మేరాజ్‌ఖాన్, సందీప్, రామకృష్ణ, వెంకటరెడ్డి, దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


మెదక్ ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

కౌడిపల్లి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 13: మండల పరిధిలోని దేవులపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన 19 మంది కార్యకర్తలు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. ఎంపీ రఘునందన్‌రావు స్వగృహంలో సోమవారం ఉదయం రాజశేఖర్, భూమయ్య, రాములు, ప్రభు, లచ్చగౌడ్‌తో పాటు కొంత మంది పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి ఎంపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ఉన్నారు.